



## అర్షాద్

సభకి నమస్కారం!

సాహితీ వేదికపై పెద్దలు, లబ్ధప్రతిష్ఠులు పదిమందికి పైగా ఆసీనులయ్యారు. ఆ వరసలో, వేదికపై మా తాతయ్య కూడా వుండాలి. వారు అనారోగ్యరీత్యా రాలేకపోయారు. డెబ్బయ్యేడు సంవత్సరాల వయసున్న వారి ఆరోగ్య విషయమై మా కుటుంబమంతా తీవ్ర ఆందోళన చెందుతోంది. డాక్టర్లు కూడా 'మా చేతుల్లో ఏమీ లేదు' అనేశారు.

అయితే మా తాతయ్యను మాకు దక్కించే శక్తి ఈ సాహితీ వేదికలకే వుంది. అంచేత మిమ్మల్ని ప్రార్థించడానికి వచ్చేను. సభాధ్యక్షులు నాకు మాట్లాడటానికి అవకాశం ఇచ్చినందులకు వారికి నా ధన్యవాదాలు. వేదికపై మా తాతయ్య లేని కారణంగా, ఆయన సమయాన్ని నాకిచ్చినందులకు నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. (నేనూ అప్పుడప్పుడు కథలు, కవితలు రాస్తుంటాను)

సభలో మీరంతా రెండున్నర గంటలకు పైగా ఈ సాహితీ వాతావరణ మలయమారుత వీచికలలో మల్లెపూల సుగంధ సౌరభంలో మునిగి పరవశులై తేలియాడారు. సాహితీ సభలంటే మా తాతయ్యకి ప్రాణమని మీకుప్రత్యేకంగా తెలియజేయ నక్కర లేదని భావిస్తున్నాను. ఆయన రాయడం మానేసి ఇరవయ్యేళ్లు దాటినా, సాహితీ సభలకు మాత్రం ఏనాడూ మిస్ కాకుండా, ఇరవయ్యేళ్లయువకుడిలా పరిగెట్టుకువచ్చేవారు.

ఆయన మంచి వక్త అని మీకుతెల్సు. తను రచనా వ్యాసంగం చేసినన్నాళ్లు వేదిక ఎక్కలేదు. వేదిక ఎక్కడానికి సిగ్గుపడ్డాడు. మొహమాటపడ్డాడు. మాఖర్మకాలి, ఆయన్ని కొందరు బలవంతంగా ఒక రోజున వేదిక ఎక్కించేసేరు. ఆ రోజు నుంచి ఆయనకు వేదికే ప్రపంచమయి పోయింది. ఆ రోజు నుంచి సిగ్గు, మొగమాటం లేకుండా వేదిక ఎక్కేయడం అరంభించేరు.

సభకు వచ్చే మా తాతయ్యను వేదికపైకి పిల వకుంటే అలుగుతారనీ, శివతాండవం చేస్తారనీ ఈ వూళ్లోని సమస్త సాహితీ సంస్థలకి తెల్సు. మా తాతయ్య అంతో,ఇంతో ఒక సాహితీవేత్త కావ డంతో, వారిపై గౌరవంతో కాదనలేక, తను ఏ సమయంలో సభకు విచ్చేసినా, వేదికపై కుర్చీ వేసి కూర్చో బెట్టేస్తారు. నాకు తెల్సి, మా తాత య్యను సభలో ప్రేక్షకుడిగా నేనెప్పుడూ చూడ లేదు. అంతటి అదృష్టం మాకు కలగనివ్వరు కూడా..!

'మీ తాతయ్య వేదిక ఎక్కితే మీకొచ్చిన నష్టం ఏమిటి? బాధ ఏమిటీ?' అని మీరు అడుగు తారు. ఆ విషయానికే వస్తున్నాను. వేదికపై ఎంతటి మహానుభావులైనా ఎంతమంది కూర్చో గలరు? మహా అయితే ముగ్గురూ, నలుగురు. కాని మా తాతయ్య లాంటి సాహితీవేత్తల ఒత్తిడికి తట్టుకోలేకో, లేక సభలు నడిపే సంస్థలు విశాల హృదయులు కావడం చేతో, వేదికపై ముందు వరస చాలకుంటే వెనుక వరసలో కూడా కుర్చీలు వేయబడుతున్నాయి. పాపం కిందా మీదా పడి ఆహూతులను పది నుంచి పదిహేను మంది వరకు మానేజ్ చేయగలుగుతున్నారంటే మనం ఎటువైపు పయనిస్తున్నాం అనిపిస్తుంది.

ఒక రొచ్చు రాజకీయ సభల స్థాయికా? వేది కపై మీ కన్నా మేమే ఎక్కువ మంది ఇమిడి పోగ లమని సవాల్ చేస్తున్నట్టు పోటీ పడుతున్నామా? సాహితీ సభల్లోకి రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు చొచ్చుకు వచ్చేస్తున్నారను కోండి...సాహిత్యం స్పెల్లింగ్ తెలియకపోయినా.. అది వేరే విషయం.

మైక్ ముందున్న ఉపన్యాసకుడినే కాక, శిలా విగ్రహాల్లో వేదికపై కూర్చున్న ఆహూతులను కూడా అభిముఖంగా కూర్చున్న ప్రేక్షకులు చూడ గలరు. చూస్తూ చూస్తూ బోర్ కొడితే మధ్యలో లేచి వెళ్లిపోగల స్వతంత్రులు.

మరి వేదికపైనున్న విగ్రహాలు? ఉపన్యాసం కానిచ్చేస్తే వాళ్లూ నెమ్మదిగా జారుకోవచ్చు. ఎవరు వద్దంటారు? కానీ వెళ్లరు. సభ ముగిసే వరకూ, ఎవరో శపించినట్టు కుర్చీకి అంటుకుపో తారు. మా తాతయ్య అయితే మధ్యలో లఘు శంక తీర్చుకోవడానికి కూడా లేచి వెళ్లరు.

ఆ వేదికకు ఉన్న మహత్తు ఏమిటో, దాని మాగ్నెటిక్ పవర్ ఏమిటో..! నాకు అర్థం కాదు. మా తాతయ్యకు అదేం మాయ రోగమో, అదేమీ కీర్తి కండూతో నాకు బోధప డదు. సినిమాల్లో పాలేరు మెట్ల దిగువన చేతులు కట్టుకు నించుంటే, మేడమెట్లపై ఠీవిగా నిలబడి బూతులు తిట్టే భూస్వామిలా మా తాతయ్య వేదిక ఎక్కి ఫీలయిపోతాడేమో!


వేదికను అలంకరించిన పెద్దలు మందలోంచి, కుర్చీలోంచి లేచి మైక్ వద్దకు వెళ్లారు. మాట్లాడాక తిరిగి తన కుర్చీలో కూర్చోవడం పెద్ద సర్కస్ ఫీటే. ప్రేక్షకులు ఉపన్యాసాల కన్నా ఈ విన్యాసా లనే చూసి నవ్వుతూ, పరమానందభరతులై, మరో సర్కస్ ఫీటు కోసం ఎదురు చూస్తున్నట్లు అనిపిస్తుంది నాకు.

సాహితీ సభలో తను మాట్లాడే పది నిమి షాల సమయం కోసమే ఎదురు చూడకుండా ఎవరెవరు ఏమేమీ మాట్లాడుకుంటున్నారో సమస్తం మా తాతయ్యకి కావాలి. అంతటి సాహి తీప్రియుడు.

అయితే మా తాతయ్యకు వచ్చిన ఇబ్బంది ఏమిటంటే...వేదికపై ముందున్న ఉపన్యాకుడిని.. అభిముఖంగా కూర్చున్న ప్రేక్షకులు చూసినంత సులువుగా చూడలేడు. గంటల కొలది, ఎంతసే పని అసౌకర్య, ఇబ్బందికర స్థితిలో మెడతిప్పి చూడగలరు? కష్టపడి మెడ తిప్పగలము గానీ మొత్తం శరీరాన్ని తిప్పలేము. కుర్చీ తిప్పడానికి వీలుకాదు.

మా తాతయ్య సర్వైకల్ స్పాండిలోసిస్ తోనూ, వెన్నునొప్పితోనూ బాధపడుతూ..ఎంత సేపని అలా ఉపన్యాసకుడి వైపు చూడగలడు? స్వతః ఆ రోగాల ఆస్తి ఉండడం చేత మెడ తిప్పలేక పోవడం కాదు ఈ వేది కలు ఎక్కిన తర్వాతే ఆ రోగాలు మా తాతయ్యకు సంక్రమించాయి. సభలో ఉన్నంత సేపూ ఆ తిమ్మిరిలో, మైకంలో తనకేమీ తెలీదు.

మీటింగ్ నుంచి ఇంటికొచ్చాక ఆయన పాట్లు



చూడాలి. తను నిద్రపోడు..మమ్మల్ని నిద్రపోనివ్వడు. మెడనొప్పి ఇరువైపుల భుజాల నుంచి కిందకు చేతివేళ్ల వరకు సలసలమని పాకి సలపడం, తిమ్మిర్లు పట్టేయడం, ఒకే భంగిమలో గంటల తరబడి కూర్చోవడం వల్ల నరాలపై ఒత్తిడి పెరిగి నొప్పి తీవ్రం కావడం, చుట్టుపక్కల చూడాలంటే మనిషి మనిషంతా తిరగాల్సిరావడం, ఒక్కొక్కసారి కళ్లు తిరిగి పడిపోవడం, వెన్నునొప్పితో గిజగిజలాడుకు పోవడం చూసి.. ఏదో పెయిన్ కిల్లర్ ఇచ్చి, వేడినీళ్లతో కాపి, డాక్టర్ రాసిచ్చిన ఏదో జెల్ మెడకీ, వెన్నుపూసకీ రాయడం ఇదే మా పని అయిపోయింది.

తను ఇబ్బంది పడుతూ, మమ్మల్ని ఇబ్బంది పెడుతున్న మా తాతయ్యకి రోగ విముక్తి కలిగించమని సాహితీ సంస్థల్ని వేడుకుంటున్నాను. ఇందాక అధ్యక్షులవారు ఒక మాట అన్నారు. మీటింగ్‌లకు వచ్చే జనం బొత్తిగా, పలచగా ఉంటున్నారని, ఎప్పుడూ వచ్చే ఆ పది మంది సాహితీప్రియులే వస్తున్నారని, ఆ వచ్చిన వాళ్లు కూడా అరవై, డెబ్భయ్ సంవత్సరాలు దాటిన వాళ్లేనని చాలా బాధ పడ్డారు.

'ఎందుకు బాధ పడాలి?'

పాలోమని అందరూ వేదికపైకి ఎక్కి, తొక్కి, పొడిచేస్తామంటే-ఎదురుగా ఉన్న కుర్చీలు బోసిపోవా? అసలు, ఉత్సవ విగ్రహాల్లా అంతమంది వేదికపై గంటల తరబడి ఎందుకు కూర్చోవాలి? నా దృష్టిలో గోడకుర్చీ వేసినట్టు అదొక పనిష్మెంటే. ఎటొచ్చీ, కీర్తి కండూతి తిమ్మిరి ఆ బాధను కూర్చున్నంతసేపూ పిల్లతెమ్మెరలా భావింపజేస్తుంది. అంతేకదా?

మా తాతయ్యను కన్నార్పకుండా ఒక ఛార్మింగ్ సెలబ్రిటీలా ప్రేక్షకులు చూస్తున్నారనుకోవడం పొరపాటు. కొందరు ప్రేక్షక మహాశయులు ఎంతసేపైనా సినీతారల అందాలను చూడగలరు. విన్యాసాలు చేసే కోతులనైనా చూడగలరు తప్పా సాహితీమూర్తులను తిలకించి, పులకించలేరు. ముసలి ముఖాలను ఏం చూస్తారు?

మా మాటకొస్తే సాహితీసభ ఎప్పుడూ సబ్జెక్టివ్‌గా కాకుండా ఆబ్జెక్టివ్‌గా వుండాలి. ఒక పుస్తకావిష్కరణ అంటే సభలో సదరు పుస్తకమే సెలబ్రిటీ కావాలి గాని వేదికపైనున్న పెద్దలు కాదు. చివరికి ఆ పుస్తకం రచయిత కూడా కాదు.

ఒక నాటకం చూడండి. పాత్రలు మనముందుకొస్తాయి. నటించి, డైలాగ్స్ పలికి తెరవెనక్కి వెళ్లిపోతాయి. స్టేజ్‌పైనే వుండిపోవు. కేవలం సాహిత సభల్లోనే వేదికపైనున్న వాళ్లు గోడపై పేడ ముద్దల్లా అలా ఉండిపోతారు

ఆ మధ్య ఒక ఎం.ఎల్. పార్టీ నిర్వహించే మీటింగ్‌కు వెళ్లాను. ఆ మీటింగ్ ఎంతో ముచ్చట వేసింది. వేదికపై మైక్ ఒక్కటేఉంది. దాని చుట్టూ బెల్లంపై ఈగల్లా ఉపన్యాసకులు లేరు. ప్రేక్షకుల్లోనే ఉపన్యాసకులంతా ఉన్నారు. మొదట మైక్ వద్దకు అధ్యక్షుల వారు వచ్చారు. తను చెప్పవలసిందంతా చెప్పి, తర్వాత మాట్లాడవలసిన వ్యక్తిని పిలిచారు. అధ్యక్షుడు మైక్ ఆయన చేతికిచ్చి, మళ్లీ ప్రేక్షకుల మధ్యకు వచ్చేశారు. ఒకరి తర్వాత ఒకరు వెళ్లి మాట్లాడారు. తర్వాత అధ్యక్షులు తుది పలుకులు పలికారు. సభ ఎంత చక్కగా ఉంది. ఎంతో నీటుగా, హాయిగా ఉంది.

వేదికపైకి వక్త మాత్రమే వెళతారు. విదేశాలలో కూడా ఇదే పద్ధతి. ఎంతటి వి.వి.ఐ.పి.లు అయినా నలుగురితో బాటే వక్తకు అభిముఖంగా కూర్చుంటారు. కాకుంటే, ముందు వరుసలో...

సత్కారాలు,దండలు,బొకేలు వుండవు. మనం శాలువాను కూడా వదల లేకపోతున్నాం. సరే.. అది తరతరాల సంప్రదాయమనుకుందాం. సాహితీ సంస్కృతిలో భాగం అనుకుందాం. కాని వేదికపై పది, పన్నెండు కుర్చీల కల్చర్‌ని మాత్రం బహిష్కరిద్దాం. వేదికపై అధ్యక్షుడికి ఒక కుర్చీ, వచ్చీ పోయే ఉపన్యాసకుడికి అవసరమైతే మరో కుర్చీ చాలు. వక్తలు అంతా అధ్యక్షుడి పిలుపుపై వచ్చి, మాట్లాడి వెళ్లిపోతారు. ప్రేక్షకుల్లో నిరీడుగా, స్వేచ్ఛగా కూర్చుంటారు.


గౌరవనీయులైన వేదిక పెద్దల్లారా! ఈ విషయమ్మై మీరంతా ఆలోచించండి. మా తాతయ్యను రక్షించండి. సాహితీ సభలను కాపాడండి.

నామాటకు ఎంతమంది విలువ ఇచ్చి, ఆలోచిస్తారనేది అనుమానమే. ఈ వేదిక వ్యామోహం నుంచి బయటపడటం సామాన్య విషయం కాదు.

ఈ సందర్భంగా అన్నలకు చిన్న విజ్ఞప్తి . మీరెన్నో మంచి పనులు చేశారు. అలాగే ఈ సాహితీ సభల వ్యవహారంలో కలుగు జేసుకుని, ముందుకు వచ్చి 'సభలు జరుపుకోండి. కాని వేదికపై ఒకరు, ఇద్దరు కన్నా ఎక్కువ మంది కన్పిస్తే పిట్టల్లా కాల్చేస్తాం' అని ఒక్కమాట అనండి చాలు. కాల్చేయనక్కర లేదు. కళ్లెర్రజేస్తే చాలు. మన సాహితీసభలు చక్కగా, సంస్కారవంతంగా సాగుతాయి. మళ్లీ మంచిరోజులువస్తాయి.

అధ్యక్షులవారు నా ఉపన్యాసం ఆపేయమని ఒత్తిడి తెస్తున్నారు...మరిక వుంటాను. నమస్తే.

✻



## హన్సిక నోట ప్రభు జపం...

ప్రభు గర్ల్ ఫ్రె ్స్‌లో 'దేశముదురు' హన్సిక వచ్చి చేరింది. ట్టుకున్న పెళ్ళాంతో సహా అందరూ ఏమనుకున్నా పట్టించుకోకుండా నిన్న మొన్నటి వరకూ నయనతారతో చెట్టాపట్టాలేసుకొని తిరిగిన ప్రభుదేవా ఇప్పుడు హన్సికతో 'క్లోజ్'గా మూవ్ అవుతున్నాడన్న పుకార్లు ఫిలింనగర్‌లో జోరుగా షికారు చేస్తున్నాయి. దీనికి కారణం ఉంది. ఓ సినిమా షూటింగ్ నిమిత్తం హన్సిక, ప్రభు ా కలిసి పారిస్‌లో 40 రోజులు గడిపి వచ్చారు. అప్పుడే వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం బలపడిందని పలువురు అంటున్నారు. వీరి ఊహాగానాలకు హన్సిక మాటలు కూడా తోడయ్యాయి.. ఈ సినిమా షూటింగ్ నుంచి వచ్చినప్పటి నుంచి హన్సిక ఆపకుండా ప్రభుదేవా గురించి పొగుడుతూనే ఉందట! "పారిస్‌లో ఉన్న 40రోజులు నాలుగు నిమిషాల్లా గడిచిపోయాయి. ప్రభుదేవా సర్ గురించి ఎంత చెప్పినా తక్కువే! పక్కా స్క్రిప్టుతో సెట్‌లోకి వస్తారు. తనకు కావలసింది నటీనటుల నుంచి తీసుకుంటారు. ఈ సినిమా ఎంత బాగా వచ్చిందో చెప్పలేను. చూస్తే మీకు తెలుస్తుంది. పారిస్‌లో నాకు ఎంతో మంది అభిమానులున్నారు. ప్రతీరోజూ షూటింగ్‌ను అందరం ఆడుతూ పాడుతూ చేసేసాం. అలాగని సీరియస్‌గా చేయలేదని అనుకోకండి. ఇలా చెప్పుకుంటూ పోతే ొండవీటి చాంతాడంత అవుతుంది. మొత్తానికి ఆ రోజులు మళ్ళీ రావు. వాటిని ఎన్నటికి మరిచిపోలేను." ఈ మాటలు విన్న తరువాత కూడా నయనతార జాగ్రత్త పడకపోతే కష్టం అని పలువురు హెచ్చరిస్తున్నారు.

Printed and Published by **Vemuri Radhakrishna,** Managing Director, on behalf of Aamoda Publications Pvt. Ltd., Plot No.76, Aswani Layout, Huda Heights, Jubilee Hills, Hyderabad-500 033. Ph.(040) 23558233/44, Fax No.23558288. Printed at Aamoda Press, R.S.No.191/3, Ward No.43, Donka Road, Patamata, Vijayawada - 520 010, Reg.No.: APTEL/2004/12594. Editor: **A.N.JAGANNADHA SARMA**